క్లుప్తంగా

మత్స్యకార భరోసా అందరికీ ఇవ్వాలి



మాట్లాడుతున్న బెస్త శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ జిల్లాలకు కూడా మత్స్యకార భరోసా అందించాలని జాతీయ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు బెస్త శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రాంతీయ వ్యత్యాసాలు చూపుతూ రాయలసీమ ప్రాంతంలోని వారికి మత్స్యకార భరోసా ఎగ్గొట్టేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన మాదిరిగా అర్హులైన ప్రతిఒక్కరికీ పథకం అమలుచేయాలన్నారు. జిల్లాలోని మత్స్యకారులకు అన్యాయం చేయడం తగదన్నారు. నాయకులు ఎద్దుల వెంకటేష్, రాధాకృష్ణ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పి.శ్రావణి రెడ్డి

కర్నూలు(సెంట్రల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న నిర్వహించనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.శ్రావణిరెడ్డి, నగర కార్యదర్శి వి.భారతి కోరారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మహిళలు అభ్యున్నతి చెందాలని, ప్రభుత్వాలు వారికి చేయూత అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేసిందని మండిపడ్డారు. హామీల సాధన కోసం త్వరలో ఉద్యమ కార్యచరణ చేపడతామని స్పష్టం చేశారు. నాయకులు నాగేంద్రమ్మ, పి.రామకృష్ణరెడ్డి, పావని, సుధాదేవి, అంజలి, ఆశాబేగం, వెంకటరమ్మ, మునెమ్మ, సువర్ణ పాల్గొన్నారు.

మెట్లపై నుంచి జారిపడి వ్యక్తి మృతి



ఆదామ్ (ఫైల్)

కర్నూలు: కర్నూలు మండలం జి.సింగవరం గ్రామానికి చెందిన అడ్డాకుల ఆదామ్ (64) ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి కాలు జారి కింద పడి మృతిచెందాడు. ఈయన ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. మంగళవారం తెల్లవారుజామున ఎలక్ట్రికల్ ఆటోను ఇంటి ముందు చార్జింగ్ పెట్టి గదిలోకి వెళ్లడానికి మెట్లు ఎక్కుతుండగా అదుపుతప్పి కింద పడి గాయాలపాలయ్యాడు. భార్య మాణిక్యమ్మ, కుమారుడు రమేష్ ఆటోలో ఆదామ్‌ను కర్నూలులోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా విధుల్లో ఉన్న డాక్టర్ పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై మాణిక్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఊబకాయంతో ఆరోగ్య సమస్యలు

కర్నూలు(హాస్పిటల్): చిన్నతనం నుంచే ఊబకాయం రావడం ప్రమాదకర సంకేతమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ బి.విజయానంద బాబు చెప్పారు. ప్రపంచ ఊబకాయ దినోత్సవం పురస్కరించుకుని ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలులోని ఎతీనా స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊబకాయం వల్ల భవిష్యత్‌లో గుండె జబ్బులు, స్ట్రోక్, రక్తపోటు, కొలెస్ట్రాల్, ఇన్సులిన్ నిరోధకత వంటి వ్యాధులకు దారి తీస్తుందని చెప్పారు. అధిక కొవ్వు, చక్కెర, మైదా ఉన్న ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. పాఠశాల పాఠ్యాంశాల్లో శారీరక విద్యను ప్రోత్సహించాలని సూచించారు. ఐఏపీ కర్నూలు సెక్రటరీ డాక్టర్ రత్నాకర్, ట్రెజరర్ డాక్టర్ ప్రకాష్ ఆనంద్, ప్రిన్సిపాల్ కేబీ.జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్, శబ్దం, మజాకా, ఛావా, అఘాతియా, తండేల్, సంక్రాంతికి వస్తున్నాం
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : తండేల్, శబ్దం, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్, ఛావా, మజాకా, నేనెక్కడున్నా, గార్డ్ – రివేంజ్ ఫర్ లవ్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : శబ్దం, సంక్రాంతికి వస్తున్నాం, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
శ్రీరామ : లైలా
రాజ్ : అఘాథియా
భరత్ కాంప్లెక్స్ : నేనెక్కడున్నా, తకిట తదిమి తందానా
విజయ థియేటర్ : మజాకా
విక్టరీ టాకీస్ : సంక్రాంతికి వస్తున్నాం

సూర్యప్రభపై రంగనాథుడి విహారం



సూర్యప్రభ వాహనంపై స్వామివారు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో శ్రీగోదా రంగనాయకి సమేత రంగనాథ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం స్వామి వారికి సూర్య, చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. ద్వారతోరణం, ధ్వజ కుంభారాధన, బలి ప్రదానం, తదితర విశేష పూజలు నిర్వహించారు. బుధవారం హనుమద్వాహన సేవ, గరుడ వాహన సేవ, ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజుగుప్త తెలిపారు. ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాలసుధాకర్, ఇటిక్యాల పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



చంద్ర ప్రభ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

ఉద్యోగులు బాధ్యతగా నడుచుకోవాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కొందరు ఉద్యోగులు ఆసుపత్రికి సంబంధించిన విషయాలను బయటకు చెబుతున్నారని, విధి నిర్వహణకు బద్ధులై ఉండి పనిని, ఫైళ్లను రహస్యంగా నిర్వహించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో మినిస్టీరియల్ స్టాఫ్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటించాలని, తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేయాలన్నారు. ప్రజలు, రోగుల ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని, నిర్లక్ష్యం పనికిరాదన్నారు. అటెండర్లు డ్రెస్‌కోడ్, ఐడీ కార్డు ధరించాలన్నారు. కోర్టు కేసులు, బడ్జెట్ ఫైల్స్, అత్యవసర మందులకు సంబంధించిన ఫైల్లను త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఉద్యోగులు పనితీరు మెరుగుపరచుకోవాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఏడీ మల్లేశ్వరమ్మ, ఏఓ శ్రీనివాసులు, ఆఫీస్ అకౌంటెంట్లు శ్రీనివాసులు, లతీఫ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.



ఆలయం వద్ద భక్తుల రద్దీ

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- రోజుకు లక్ష మందికి ఉపాధి కల్పించాలి
- రెవెన్యూ సర్వీసులను గడువులోపు పరిష్కరించాల్సిందే
- మండలాధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాలపై నివేదిక సమర్పించాలని మండలాల ప్రత్యేకాధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాగునీటి ఎద్దడి, ఎంఎస్ఎంఈ సర్వే, పీజీఆర్ఎస్, రెవెన్యూ సరీ్వసులు, ఎన్ఆర్ఈజీఎస్ పనులపై మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, మునిసిపల్ కమిషనర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో తాగునీటి అంశం అత్యంత ప్రాధాన్యత కలిగిందని, ఇందుకు సంబంధించి ఏదైనా ప్రతికూల వార్త వస్తే వివరణ అడుగుతానని చెప్పారు. వచ్చే మూడు నెలల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి ఉండకూడదన్నారు. తాగునీటి పథకాలకు మరమ్మతులు ఉంటే వెంటనే 15వ ఆర్థిక సంఘం నిధులతో చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌ల మరమ్మతులను జెడ్పీ గ్రాంట్‌తో చేయించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద రోజుకు 68 వేల మందికి మాత్రమే పని కల్పిస్తున్నారని, ఈ సంఖ్యను లక్షకు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఉపాధి పనుల కల్పనలో ఆదోని, పెద్దకడబూరు, కోసిగి, కౌతాళం, పత్తికొండ, తుగ్గలి మండలాలు వెనుకబడ్డాయని, ఆయా మండలాల ఎంపీడీఓలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సర్వీసులను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలన్నారు. ఈ అంశంపై సబ్ కలెక్టర్, ఆర్డీఓలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సర్వీసులను పరిష్కరించడంలో విఫలమైన పెద్దకడబూరు, దేవనకొండ, చిప్పగిరి, పత్తికొండ తహసీల్దార్లకు నోటీసులు జారీచేయాలని సబ్ కలెక్టర్, ఆర్డీఓలను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు వెంటనే భూమిని గుర్తించి నివేదిక పంపాలన్నారు. ఎంఎస్ఎంఈ సర్వేను ఈ వారం లోపు పూర్తి చేయాలని, ఇంకా 33 వేల పరిశ్రమలు, సంస్థలను సర్వే చేయాల్సి ఉందన్నారు. ఆదోని, ఆలూరు, సి.బెళగల్, దేవనకొండ, గోనెగొండ్ల, గూడూరు మునిసిపాలిటీ, కోసిగి, కౌతాళం, కర్నూలు రూరల్, కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్లలో సర్వే పెండింగ్‌లో ఉందన్నారు. మూడు నెలల నుంచి చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీడీఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి ఆయా అధికారులతో వివరణ తీసుకోవాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. జిల్లాలో 0 – 6 ఏళ్ల పిల్లల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌లో వెనుకబడి ఉన్నామని, తగిన చర్యలు తీసుకొని వేగవంతం చేయాలని ఆదేశించారు. పీ4 సర్వేలో మంత్రాలయం, కౌతాళం, నందవరం మండలాలు వెనుకబడి ఉన్నాయని, త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 16 మండలాల్లో 90 శాతానికిపైగా సర్వే పూర్తైందని, మిగిలిన 7 మండలాల్లో 80 శాతంపైగా పూర్తి చేశారని, పెండింగ్ సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర చల్లా కల్యాణి, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీఓలు భరత్‌నాయక్, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

తాగునీరు కలుషితం

కల్లూరు: కల్లూరు అర్బన్ 35వ వార్డులో సోమవారం మున్సిపాలిటీ వారు సరఫరా చేసిన తాగునీరు కలుషితమై రంగు మారింది. రంగుమారిన నీటిని ఎలా తాగాలని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై 35వ వార్డు ఉమామహేశ్వర నగర్‌వాసులు జీవన్‌కుమార్, మధు, రంగస్వామి, రాము, సునీత, శ్యామలమ్మ తదితరులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. కలుషిత నీటితో అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. లీకేజీని అరికట్టి సమస్యను పరిష్కరించాలని, స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరారు.



రంగుమారిన నీరు

అనుమతి లేని కేంద్రాలను సీజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ అనుమతి లేని డయాగ్నోస్టిక్ సెంటర్లను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఎన్నో అనుమతి లేని డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వైద్య, ఆరోగ్య శాఖాధికారులు మామూళ్ల మత్తులో వారితో కలిసి పోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ క్రమంలో వివిధ ఆసుపత్రులకు వచ్చే అమాయక రోగులకు అవసరం లేకున్నా వివిధ రకాల పరీక్షలు చేసి వేలల్లో ఫీజులు లాగుతుండడంతో దిక్కుతోచడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేదంటే పోరాటాలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. నగర కార్యదర్శి బీసన్న, నాయకులు చంటి, కృష్ణ,శ్రీకాంత్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

‘వాహన మిత్ర’ వెంటనే అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు ఇబ్బంది కలిగించే జీఓలు 21, 31లను రద్దు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయంతో ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. వెంటనే వాహన మిత్ర ద్వారా ప్రతి ఆటో కార్మికుడికి రూ.15 వేలు ఇవ్వాలన్నారు. అలాగే ఆటో కార్మికులకు సొంత ఇళ్లు, వారి పిల్లల చదువు, పెళ్లిళ్లకు ఆర్థిక సాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జనగణన చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): తెలంగాణలో మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లోనూ కులగణన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో చేతివృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కారన్న అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పి.రామచంద్రయ్య హాజరై మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యవస్థలకు అనుకూలంగా నడుచుకుంటూ 99 శాతం సంపదను వాటి చేతిలో పెడుతుండడంతో చేతివృత్తిదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏపీలోనూ కుల గణన చేపట్టి వృత్తుల వారీగా ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

ఇళ్ల స్థలాలకు వెల్లువెత్తిన దరఖాస్తులు



దరఖాస్తుదారులతో కిక్కిరిసిన తహసీల్దార్ కార్యాలయం

కల్లూరు: ఇంటి స్థలాల కోసం పేదలు కల్లూరు తహసీల్దార్ కార్యాలయానికి వెల్లువలా వచ్చి దరఖాస్తులు సమర్పించారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం 2 వేల మందితో కలిసి కల్లూరు 70/2బీ సర్వే నంబర్‌లో జెండాలు పాతారు. దీంతో తహసీల్దార్ ఆంజనేయులు పరిశీలించి అర్హులైన వారు అర్జీలు ఇవ్వాలని చెప్పడంతో మంగళవారం నగరంలోని పేద ప్రజలు వేలాదిగా తరలివచ్చి రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు అందజేశారు. అంతకుముందు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్‌తో పాటు జిల్లా నాయకులు రాధాకృష్ణ, నిర్మల, రాముడు, పేదలతో కలిసి కార్యాలయం ముందు ధర్నా చేపటారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. తామంతా ప్రభుత్వ స్థలాలను పేదలకు పంచుతుంటే, అధికార పార్టీలు మాత్రం తమ ఖాతాలో జమ చేసుకుంటున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉన్నది ప్రజల కోసం అని, కొంతమంది నాయకుల కోసం కాదన్నారు. తహసీల్దార్ కార్యాలయం అక్రమాలకు, అవినీతికి అడ్డాగా మారిందని ధ్వజమెత్తారు. అర్హులకే ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఎం కోరుకుంటుందన్నారు. తహసీల్దార్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. సీపీఎం నాయకులు రాజశేఖర్, అలివేలమ్మ, అరుణ, గురు శేఖర్, రామకృష్ణ, నరసింహులు, సాయిబాబా, సుధాకరప్ప, రఫీ, ప్రభాకర్, యేసు, ఉస్మాన్, పద్మ, కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేకు సహకరించాలి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేకు ప్రజలు సహకరించాలని కమిషనర్ రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సర్వే కోసం సచివాలయాల ఉద్యోగులు వస్తారని, వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. వర్క్ ఫ్రమ్ హోమ్‌కు సంబంధించి 18 – 50 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఐటీ సెక్టార్‌కు సంబంధించి అన్ని సౌకర్యాలు ఉన్నాయా.. లేదా.. అన్న వివరాలు సేకరిస్తారని వివరించారు. ఈ సర్వే ఈనెల 10వ తేదీ వరకు కొనసాగుతుందని వెల్లడించారు.

సీపీఎం నాయకులపై కేసు నమోదు

కర్నూలు: సీపీఎం నాయకులు రాముడు, గోపాల్‌తో పాటు మరికొంతమందిపై నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పెద్దపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు కర్నూలు శివారులోని బళ్లారి రోడ్డులో 4.27 సెంట్ల పట్టా పొలం ఉంది. పేదలకు ఇళ్ల స్థలాల కోసమంటూ తన పొలానికి సంబంధించిన సరిహద్దు రాళ్లను ధ్వంసం చేసి సీపీఎం నాయకులు బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఖాళీ స్థలంలో జెండాలు పాతి గుడిసెలు వేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు రంగప్రవేశం చేసి వారిపై కేసు నమోదు చేశారు.

రక్తహీనతపై అవగాహన

కల్లూరు: గ్రామాల్లో ప్రజలకు రక్తహీనతపై అవగాహన కల్పించాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ అధికారి డాక్టర్ రఘు ఆశా కార్యకర్తలకు సూచించారు. మంగళవారం ఉలిందకొండ, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశా కార్యకర్తల మాసంతపు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ.. రక్తహీనత బారిన పడకుండా సమతుల్య పోషకాహారం తీసుకోవాలన్నారు. సాధారణ మహిళలతో పాటు గర్భిణులు హిమోగ్లోబిన్ 12కి పైగా ఉండేలా చూసుకోవాలన్నారు. డాక్టర్లు మోతీలాల్ నాయక్, శ్రీధర్, సిబ్బంది సురేష్, సంపత్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు రూరల్: అక్రమంగా కర్ణాటక మద్యం సరఫరా చేస్తున్న వ్యక్తి వద్ద నుంచి 7 బాక్సులు మద్యం స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక ఎక్సైజ్ పోలీసు కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఉదయం చిప్పగిరి మండలం సంగాల గ్రామ సమీపంలోని వాహన తనిఖీలు చేపట్టగా ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన ఎరుకల కృష్ణ బైక్‌పై తరలిస్తున్న 7 బాక్సులు కర్ణాటక మద్యం 672 టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్) గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడు కృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి బైక్ సీజ్ చేసినట్లు వివరించారు. ఎస్ఐ నవీన్ బాబు సిబ్బంది విజయ్, మాలవ్య, సూర్య ప్రకాష్, లక్ష్మయ్య సోమేష్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.3.07 లక్షలు

కర్నూలు కల్చరల్: జగన్నాథగట్టు శ్రీ రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.3.07 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ గుర్రెడ్డి మంగళవారం వెల్లడించారు. ఈఓ, ఆలయ అభివృద్ధి సమితి కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి వాసుదేవయ్య, సభ్యులు నాగరాజు, ఆదిత్య పాఠశాల అధినేత వాసుదేవయ్య సమక్షంలో కానుకల లెక్కింపు జరిగింది. హుండీ ఆదాయం రూ.3,07,292 వచ్చిందని ఈఓ వెల్లడించారు. అలాగే విరాళాల ద్వారా రూ.1,12,300, సేవా టికెట్ల ద్వారా రూ.4,45,000 వచ్చిందన్నారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మొత్తం ఆదాయం రూ.8,64,592 ఆదాయం వచ్చిందని చెప్పారు.



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

కామన్ పీజీ సెట్ రద్దుకు వినతి



ఆర్‌యూ వీసీకి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు కల్చరల్: కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలని కోరుతూ పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాయలసీమ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వి.బసవరావుకు వినతి పత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, సహాయ కార్యదర్శి ఎస్.శరత్‌కుమార్, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు రమణ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని మండిపడ్డారు. నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపుతున్నారన్నారు. ఏపీలోని అన్ని యూనివర్సిటీల్లో ప్రవేశాలకు కామన్ పీజీ సెట్ పేరుతో పరీక్షలు నిర్వహించడంతో పీజీల్లో ప్రవేశాలు భారీగా తగ్గిపోయాయన్నారు. కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టనున్నట్లు హెచ్చరించారు. విద్యార్థి సంఘాల నాయకులు అస్లాం, పవన్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ రిజర్వేషన్‌ను సాధించుకుందాం



సంఘీభావం ప్రకటిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): బేడ/బుడగ జంగాల వారికి ఎస్సీ హోదా పునరుద్ధరణ కోసం కర్నూలులోని కోల్స్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఈ నెల 28న నిర్వహించనున్న బహిరంగ సభకు ఆ వర్గీయులు వేలాదిగా తరలిరావాలని బుడగ జంగం జాతీయ అధ్యక్షుడు తాటికొండ నారాయణరావు, రాష్ట్ర అధ్యక్షుడు తుర్పాటి మనోహర్ పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలులో బుడగ జంగం నేతలు, ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం జరిగింది. ఈ నెల 28న జరిగే బహిరంగ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని ప్రకటించారు. ఎస్సీ రిజర్వేషన్‌ను సాధించుకుందామని పిలుపునిచ్చారు. సభకు ఎమ్మార్పీఎస్ నేతలు గుండాల ఈశ్వరయ్య, కేవీ రమణ, సుభాష్, ఆంద్రయ్య, భాస్కర్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. బుడగ జంగం సీనియర్ నాయకులు లక్ష్మయ్య, జయరాముడు, మద్దిలేటి, చింతలయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ అమలు చేయాలి



రైతు సభ్యత్వ నమోదు చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కల్లూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని సీపీఐ, ఏపీ రైతు సంఘం కార్యదర్శి కె.జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పెద్దటేకూరులో రైతు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతు సంఘం నాయకులు పుల్లన్న, మహమ్మద్, హేమంత్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.